# శతాధిక ఓటర్లు 267 మంది



**సూర్యాపేట జిల్లాలో 120 ఏండ్లు దాటినవారు 164 మంది**

**80 సంవత్సరాలు దాటిన ఓటర్లు 14,712**

**అత్యధికంగా తుంగతుర్తి నియోజకవర్గంలో 187 మంది..**

సూర్యాపేట, అక్టోబర్ 13 : సూర్యాపేట జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించిన ఎన్నికల సంఘం.. వంద సంవత్సరాలు దాటిన వృద్ధుల ఓట్లను ఎక్కడా తొలగించకుండా జాగ్రత్తలు తీసుకున్నది. జిల్లా వ్యాప్తంగా 100 సంవత్సరాలు దాటిన శతాధిక ఓటర్లు 267 మంది ఉన్నట్లు వెల్లడించారు. 120 సంవత్సరాలు దాటిన ఓటర్లు 164 మంది ఉన్నారు. అత్యధికంగా తుంగతుర్తి నియోజకవర్గంలో 187 మంది శతాధిక ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది.

18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు కల్పించాలని ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసుకుంటారు. తొలిసారి ఓటు వేసి తన ఆనందాన్ని పంచుకుంటారు. అయితే.. 80 ఏండ్లకు పైగా ఓటు హక్కును వినియోగించుకునే శతాధిక వృద్ధులు సైతం మన జిల్లాలో ఉన్నారు. వంద సంవత్సరాలకు పైగా వయస్సు ఉన్న ఓటర్లు జిల్లా వ్యాప్తంగా 267 మంది ఉన్నట్లు ఎన్నికల సంఘం విడుదల చేసిన ఓటర్ల జాబితాలో వెల్లడైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల విడుదల చేసిన ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో అత్యధికంగా తుంగతుర్తిలో 187 మంది శతాధిక ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 106, మహిళా ఓటర్లు 81 మంది ఉన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 47 మంది శతాధిక ఓటర్లు ఉండగా.. పురుష ఓటర్లు 20, మహిళా ఓటర్లు 27 మంది ఉన్నారు. కోదాడ నియోజకవర్గంలో 21 మంది వంద ఏండ్లకు పైబడిన ఓటర్లు ఉండగా.. పురుషులు ఏడుగురు, మహిళా ఓటర్లు 14 మంది ఉన్నారు. సూర్యాపేట నియోజకవర్గంలో 12 మంది శతాధిక ఓటర్లు ఉండగా.. ఇందులో పురుషులు నలుగురు, మహిళలు 8 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు.

**నియోజకవర్గాల వారీగా శతాధిక ఓటర్ల వివరాలు**

| నియోజకవర్గం | 100-109 ఏండ్లు | 110-119 వయస్సు | 120 ఏండ్లు పైబడిన |
|---|---|---|---|
| హుజూర్‌నగర్ | 38 | 1 | 8 |
| కోదాడ | 20 | 0 | 1 |
| సూర్యాపేట | 12 | 0 | 0 |
| తుంగతుర్తి | 29 | 3 | 155 |

**నూరేండ్లలోపు వయస్సు ఉన్న ఓటర్లు**

| నియోజకవర్గం | 80-89ఏండ్లు | 90-99 వయస్సు |
|---|---|---|
| హుజూర్‌నగర్ | 2,684 | 417 |
| కోదాడ | 2,995 | 462 |
| సూర్యాపేట | 3,112 | 527 |
| తుంగతుర్తి | 3,744 | 504 |

### 120 ఏండ్లకు పైబడిన ఓటర్లు 164 మంది

సూర్యాపేట జిల్లాలో 120 సంవత్సరాలకు పైగా వయసున్న ఓటర్లు 164 మంది ఉన్నారు. ఇందులో అత్యధికంగా తుంగతుర్తి నియోజకవర్గంలో 155 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 89, మహిళలు 66 మంది ఉన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పురుషులు ఆరుగురు, మహిళా ఓటర్లు ఇద్దరు 120 ఏండ్లకు పైబడిన వారున్నారు. కోదాడ నియోజకవర్గంలో 120 ఏండ్లకు పైబడిన ఓటరు ఒక్కరు మాత్రమే ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 80 సంవత్సరాల వయస్సు దాటిన ఓటర్ల సంఖ్య 14,712. ఇందులో కోదాడ నియోజకవర్గంలో 3,478, సూర్యాపేటలో 3,651, తుంగతుర్తిలో 4,435, హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 3,148 మంది ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం విడుదల చేసిన జాబితాలో వెల్లడైంది. ఇదిలా ఉండగా జిల్లాలో తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే యువ ఓటర్లు 30,500 మంది ఉన్నారు.

# టాప్ గేర్‌లో కారు



## 15న అభ్యర్థులకు బీ-ఫారాలు

**భువనగిరి నుంచి సీఎం కేసీఆర్ సమరశంఖం**

**ఈ నెల 16న అక్కడే బహిరంగసభ**

**26న మునుగోడులో, 29న కోదాడ, తుంగతుర్తి, ఆలేరులో..**

**31న హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండలో..**

**ఇప్పటికే 5 నియోజకవర్గాలకు ఎన్నికల ఇన్‌చార్జిల నియామకం**

**హోరెత్తనున్న ప్రచారం.. ప్రతి ఇంటినీ టచ్ చేసేలా ప్రణాళికలు**

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ పార్టీలో పూర్తి స్థాయి ఎన్నికల కోలాహలం నెలకొంది. వచ్చే నెల 30న జరుగనున్న పోలింగ్ సమరంలో విజయం సాధించేలా అడుగులు వేస్తున్నారు. తనదైన వ్యూహం, పక్కా ప్రణాళికలతో అసాధ్యమనుకున్న తెలంగాణ రాష్ట్రాన్నే సాధించిన ముఖ్యమంత్రి కేసీఆర్.. స్వరాష్ట్రంలో ఇప్పటికే రెండు సార్లు గులాబీ జెండా ఎగురవేసి హ్యాట్రిక్ విజయం కోసం సిద్ధమయ్యారు. అందులో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనూ 12కు 12 స్థానాల్లో మరోసారి జయకేతనం ఎగురవేసేలా దిశానిర్దేశం చేస్తూ అభ్యర్థులను ప్రకటించారు. జిల్లాలోని సిట్టింగ్ ఎమ్మెల్యేలకే టికెట్లు కేటాయించారు. అప్పటి నుంచే ప్రచారం చేపట్టగా.. ఇప్పటికే ఒక దఫా నియోజకవర్గాన్ని దాదాపుగా చుట్టేశారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చేసరికి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలతో మమేకమయ్యారు. ఇందులో భాగంగానే సూర్యాపేట, నల్లగొండ జిల్లా కేంద్రాల్లో మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, నకిరేకల్, తుంగతుర్తి నియోజకవర్గాల్లో మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి పర్యటించి బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ఈ సభలకు భారీగా జనాలు తరలి రావడంతో కొత్త ఉత్సాహం నెలకొంది. అభ్యర్థుల ప్రకటన నాటి నుంచి పార్టీ శ్రేణులన్నీ ఎన్నికల సమరంలోకి దిగాయి. బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

### ఇన్‌చార్జిల నియామకం.. సమన్వయంపై దృష్టి


ఇప్పటికే ఎన్నికల సమరంలోకి దూకిన బీఆర్ఎస్.. గురువారం ఐదు నియోజకవర్గాలకు ఎన్నికల ఇన్‌చార్జిలను నియమించింది. నల్లగొండకు జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, నకిరేకల్‌కు రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, కోదాడకు ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, నాగార్జున సాగర్‌కు ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, హుజూర్‌నగర్‌కు ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డిని నియమించారు. వీరు పార్టీలో సమన్వయంతోపాటు ప్రచార సరళిపై దృష్టి సారించనున్నారు. ఇదే సమయంలో ఆయా నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌లోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్న ఇతర పార్టీల నేతలను మంత్రి జగదీశ్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి ఆహ్వానించనున్నారు. దేవరకొండలో కాంగ్రెస్ పార్టీ నేత కేతావత్ బిల్యానాయక్ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌లో చేరారు. హుజూర్‌నగర్‌లో మేళ్లచెర్వు నేత జిల్లేపల్లి వెంకటేశ్వర్లు గులాబీ కండువా కప్పుకొన్నారు. ఆలేరులో పీసీసీ మాజీ కార్యదర్శి చామల ఉదయ్‌చందర్‌రెడ్డి తన అనుచరులతో బీఆర్ఎస్‌లోకి వచ్చారు. వీరందరూ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకొన్నారు. ఇదే సమయంలో శాసన మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, నల్లగొండలో చకిలం అనిల్‌కుమార్ కూడా మంత్రి కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేస్తామని ప్రకటించారు. ప్రతిపక్షాలు ఇంకా తమ అభ్యర్థులను ప్రకటించక ముందే బీఆర్ఎస్ అన్ని కోణాల్లో ఎన్నికల సమరంలోకి దూకింది. రానున్న రోజుల్లో మరింత టాప్ గేర్‌లో దూసుకుపోయేందుకు అస్త్రశస్త్రాలతో ముందుకు సాగుతున్నది.

### భువనగిరి నుంచి సమర శంఖారావం

ఉమ్మడి జిల్లాలో తెలంగాణ ఉద్యమానికి అడ్డాగా పేరొందిన భువనగిరి నుంచి పార్టీ అధినేత కేసీఆర్ ఎన్నికల సమర శంఖరావం పూరించనున్నారు. ఈ నెల 16న మధ్యాహ్నం 2గంటలకు భువనగిరిలో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి నేతృత్వంలో జరుగనున్న సభలో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు తరలివచ్చేలా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇక్కడి నుంచి మొదలయ్యే సీఎం కేసీఆర్ ప్రచారం ఈ నెలాఖరు నాటికే 8 నియోజకవర్గాల్లో పూర్తయ్యేలా షెడ్యూల్ ప్రకటించారు. ఈ నెల 26న మధ్యాహ్నం 3 గంటలకు మునుగోడులో జరిగే సభలో సీఎం కేసీఆర్ ప్రసంగిస్తారు. 29వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 4 గంటల మధ్యలో ఒకే రోజు మూడు నియోజకవర్గాల్లో కోదాడ, తుంగతుర్తి, ఆలేరులో జరిగే సభలకు ముఖ్యమంత్రి హాజరు కానున్నారు. ఈ నెల 31న మరో మూడు నియోజకవర్గాలు హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండలో గంటకో సభ చొప్పున మధ్యాహ్నం ఒంటి గంట నుంచి నాలుగు గంటల వరకు పాల్గొంటారు. సూర్యాపేట, నకిరేకల్, నల్లగొండ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో నామినేషన్ల తర్వాత కేసీఆర్ సభలు జరుగనున్నాయి.

### 15న బీ-ఫామ్‌ల అందజేత

ఇప్పటికే అభ్యర్థుల ప్రకటనలో సవాల్ విసిరిన సీఎం కేసీఆర్ భీ-ఫామ్‌ల అందజేతలోనూ అదే దూకుడు ప్రదర్శిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే ప్రకటించిన అభ్యర్థులందరికీ ఈ నెల 15న తెలంగాణ భవన్‌లో భీ-ఫారాలు అందజేస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో ఆదివారం పార్టీ అభ్యర్థులంతా అక్కడ పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అదేరోజు సీఎం కేసీఆర్ హుస్నాబాద్ బహిరంగ సభలో పార్టీ మేనిఫెస్టో ప్రకటించనున్నారు. కొద్దిరోజులుగా మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు పలు సందర్భాల్లో సీఎం కేసీఆర్ శుభవార్త చెబుతారంటూ ప్రకటిస్తూ వచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు పార్టీ వర్గాలతోపాటు సర్వత్రా బీఆర్ఎస్ మేనిఫెస్టోపై అమితాసక్తి నెలకొంది.



# పూల పండుగొచ్చె

## నేడు ఎంగిలిపూల బతుకమ్మ

**తొమ్మిది రోజులు ఊరూవాడ సంబురాలు**

**పలు విద్యాసంస్థల్లో ఘనంగా బతుకమ్మ వేడుకలు**

బొడ్రాయిబజార్, అక్టోబర్ 13 : తెలంగాణ ఆడపడుచుల ప్రత్యేకమైన పూల పండుగ రానే వచ్చింది. శనివారం ఎంగిలి పువ్వు బతుకమ్మ ఉండగా.. మహిళలు పెద్ద సంఖ్యలో పూలను కొనుగోలు చేస్తున్నారు. దాంతో శుక్రవారం జిల్లా కేంద్రాల్లోని ప్రధాన కూడళ్లు, పూల సెంటర్లు మహిళలతో కళకళలాడాయి. బతుకమ్మ పండుగను పురస్కరించుకొని గ్రామాల్లోని మహిళా రైతులు టేకు, గునువు పూలకు రంగులు అద్దుకొని చిన్న చిన్న కట్టలుగా తీసుకొచ్చి అమ్మకానికి ఉంచారు. తీరొక్క పూలతోపాటు బంతి పూలను మహిళలు అధికంగా కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరిచారు. బంతి, గులాబీ పూలు కిలో రూ.100 ఉండగా, చామంతి పూలు కిలో రూ.200, గునుగు పూలు చిన్న కట్టలు 50రూపాయలకు మూడు చొప్పున విక్రయిస్తున్నారు. బతుకమ్మకు ప్రత్యేకమైన తంగెడు పువ్వు రెండు కట్టలు రూ.100కు అమ్ముతున్నారు. ధర ఎంత ఉన్నా ఏడాదికోసారి వచ్చే పండుగకు మహిళలు పెద్ద ఎత్తున పూలను కొనుగోలు చేస్తుండడంతో పట్టణంలో సందడి నెలకొంది.



సూర్యాపేటలో ఎంగిలి పువ్వు బతుకమ్మకు పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు



సూర్యాపేటలో పూల కొనుగోలు..



సూర్యాపేటలో బతుకమ్మలతో జయ పాఠశాల ఉపాధ్యాయినిలు, విద్యార్థినులు

### పండుగకు ఏర్పాట్లు పూర్తి

మహిళలు ఎంతో ఉత్సాహంగా ఆనందోత్సాహాల నడుమ జరుపుకొనే బతుకమ్మ పండుగకు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు, పుల్లారెడ్డి చెరువు, నల్లచెరువు బతుకమ్మ ఘాట్‌లతోపాటు విలీన గ్రామాల్లోని బతుకమ్మ కూడళ్లలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎన్నికల కోడ్ ఉండడంతో అధికారులు అన్ని ఏర్పాట్లు చేయిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో డస్ట్ పౌడర్ పోయించడంతోపాటు లైటింగ్ సౌకర్యాన్ని కల్పించారు. మహిళలు ప్రశాంత వాతావరణంలో బతుకమ్మ ఆడేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని చెరువుల వద్ద బతుకమ్మలను నీటిలో వదిలేందుకు సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు.



సూర్యాపేట పట్టణంలోని బతుకమ్మ ఘాట్ వద్ద లైటింగ్, ఇతర ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

# సభ ఏర్పాట్ల పరిశీలన



భువనగిరిలో ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భువనగిరి అర్బన్, అక్టోబర్ 13 : ఈ నెల 16న భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగే ప్రజా ఆశ్వీరాద సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. సభా వేదికను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య, బీఆర్ఎస్ పార్టీ పట్టణాధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# అల్లరి ALLARI

**చెప్పుకోండి**

1. 'వందేమాతరం' గేయం ఏ నవల నుంచి తీసుకున్నారు?
2. పేపర్ కరెన్సీని విడుదల చేసిన మొదటి దేశం ఏది?
3. ఛత్రపతి శివాజీ రైల్వే టెర్మినస్ ఏ నగరంలో ఉన్నది?





**చిట్టి హ్యాండ్స్**

**పి. రమేశ్,** కాటారం.

**పెద్దల మాట**



**అందరూ** గొప్పగొప్ప సేవలు చేయలేరు. కానీ, చిన్నపాటి సేవ చేసినా గొప్పగా ఉండాలి.

• **మదర్ థెరిసా**

**పదసృష్టి**



**కింది** పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

Heart

Ex : Art

**జవాబులు**
చెప్పుకోండి:
1. ఆనందమఠ్, 2. చైనా, 3. ముంబై


## అత్యాశ

**కథ**

**ఒక దట్టమైన** అడవిలో ఓ గండుచీమ ఉండేది. ఒకరోజు దానికి నీటిపై ప్రయాణం చేయాలని ఆశ పుట్టింది. ఇంతలో పక్కనే ఉన్న చెట్టు నుంచి ఒక ఆకు రాలి కిందపడింది. దాంతో చీమ.. ''మిత్రమా! నాకు నీళ్లలో విహరించాలని ఉంది. నన్ను నీటిపై తీసుకెళ్తావా?'' అని అడిగింది. అందుకు ఆ ఆకు ''సరే!'' అన్నది. చీమను ఎక్కించుకుని.. నీటిపై ప్రయాణం చేయసాగింది ఆకు. అలా ప్రయాణిస్తున్న ఆ గండుచీమకు.. నీటిలోపల ఈత కొడుతున్న చేపపిల్ల కనిపించింది. అప్పుడు చీమ.. 'ఇలా ఆకుపై కూర్చొని ప్రయాణించడం ఏమంత బాగాలేదు. అలా చేపలా సొంతంగా ఈత కొట్టడంలోనే అసలైన ఆనందం ఉంది!' అనుకున్నది. వెంటనే చేపతో.. ''చేప మిత్రమా! నాకు నీలా నీటిలోపల మునకలు వేస్తూ తిరగాలని ఉంది. కొంచెం ఈత నేర్పించవా!?'' అని వేడుకుంది. చేప కూడా ''సరే!'' అంటూ, చీమకు ఈత ఎలా కొట్టాలో నేర్పించింది. దాంతో చీమ ఆనందంగా ఈత కొట్టసాగింది. నీటిపై ఈదుతూ.. గాలిలో ఎగురుతున్న పిచ్చుకను చూసింది చీమ. అంతే! ఎలాగైనా సరే తాను కూడా గాలిలో ప్రయాణించి తీరాలని నిర్ణయించుకుంది. పిచ్చుకను పిలిచి.. ''పిచ్చుక బావా! నన్ను గాలిలో తిప్పవా!?'' అని బతిమిలాడింది. పిచ్చుక కూడా కాదనలేక.. ''సరే!'' అంటూ, తన వీపుపై ఎక్కించుకుని గాలిలో తిప్పింది. అయితే, చీమకు మళ్లీ అత్యాశ కలిగింది. 'ఇలా పిచ్చుక వీపు మీద ప్రయాణించడం కన్నా.. నేనే స్వయంగా గాలిలో ఎగిరితే అద్భుతంగా ఉంటుంది కదా!' అనుకున్నది. ఆ ముచ్చటను పిచ్చుకతో చెప్పింది. ''నాకూ నీలా ఎగరాలని ఉంది. నీ ఈకలు ఇస్తే ఎగురుతాను!'' అన్నది. అందుకు పిచ్చుక.. ''అలా వీలుకాదు మిత్రమా! గాలిలో ఎగరాలంటే రెక్కలు ఉండాలి. అంతేకానీ, ఇలా ఈకలను కట్టుకొని ఎగరలేవు!'' అని చెప్పింది. అయినా చీమ వినిపించుకోలేదు. ''ఫరవాలేదు! నేను ఎగురుతాను. వాటిని నా ఒంటికి అంటించుకున్నాక.. నన్ను పైనుంచి వదిలేయి. అలాగే ఎగురుకుంటూ కిందికి వస్తాను!'' అంటూ మంకుపట్టు పట్టింది చీమ. చేసేది లేక ''సరే! నీ ఇష్టం!'' అంటూ పిచ్చుక తన రెండు ఈకలను చీమకు అంటించి.. గాల్లో వదిలేసింది. అంతే! చీమ గింగిరాలు కొడుతూ కిందపడింది. ఇంకేముంది... దట్టమైన ముండ్ల పొదలో ఇరుక్కోవడంతో బయటికి వచ్చే ప్రయత్నంలో కాళ్లు విరిగి, ఓ మూలన కూర్చుంది. అత్యాశ వల్లే తనకీ గతి పట్టిందని ఎంతో దుఃఖించింది.

**నీతి :** దురాశకు పోకుండా దొరికిన దానితో తృప్తిచెందడం మేలు!

• **కయ్యూరు బాలసుబ్రమణ్యం**




**కనుక్కోండి**

కింది బొమ్మ సరైన నీడను కనుక్కోండి.



**తేడాలు కనిపెట్టండి**

ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు చిత్రాల్లో 6 తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టండి.



పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం.
మా చిరునామా: zindagi@ntnews.com

